RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 195 | జూన్ 29, 2025 | వెల : రూ.3-00




అండమాన్ సముద్రంలో భారీ భూకంపం!

3లో..

# నన్ను రెచ్చగొట్టొద్దు..!

- నేను బలహీనుడినా..బలవంతుడినా అనేది అందరికీ తెలుసు
- కాంగ్రెస్ పార్టీ అంటే నాకు గౌరవం
- చావుకు సైతం భయపడను
- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

నేను బలహీనుడినా..బలవంతుడినా అనేది అందరికీ తెలుసు. నన్ను రెచ్చగొట్టొద్దు. కాంగ్రెస్ పార్టీ అంటే తనకు గౌరవం ఉందని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి అన్నారు. శనివారం గాంధీభవన్‌లో పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవిని కలిశారు. ఈ మేరకు ఆయన ఉమ్మడి జిల్లా పార్టీలోని విబేధాలు, జరుగుతోన్న తాజా పరిణామాలపై క్రమశిక్షణ కమిటీకి మొత్తం ఆరు పేజీలతో కూడిన లేఖను అందజేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్సార్‌తో కాంగ్రెస్‌పై తనకు అభిమానం పెరిగిందన్నారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయాలనే తపన తనలో ఉందన్నారు. బహిరంగ విమర్శలు చేయడం మంచిదో చెడునో అంతరాత్మకు తెలుసన్నారు. భారతదేశంలో ఏకగ్రీవంగా ఎమ్మెల్సీగా గెలిచిన వ్యక్తిని తానేనని అన్నారు. బీసీలకు న్యాయం చేసే పనిలో తాను నిత్యం బిజీగా ఉంటానని తెలిపారు. రేవంత్ రెడ్డి కలకాలం సీఎంగా ఉండాలని కోరుకునే వ్యక్తినని పేర్కొన్నారు. కాంగ్రెస్ పెద్దలంటే తనకు అపారమైన గౌరవం ఉందన్నారు. తనను ఎవరూ ఎలాంటి ప్రశ్నలు అడగలేదని తెలిపారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తన ముందు ఉన్న లక్ష్యమని స్పష్టం చేశారు. తాను రాజీనామా చేసి కాంగ్రెస్‌లోకి వచ్చారని కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి రాజీనామా చేస్తారో లేదో ఆయనే తేల్చుకోవాలన్నారు. తనను రెచ్చగొట్టొద్దని, ఇంకా తన శరీరంలో 4 బుల్లెట్లు ఉన్నాయని చావుకు కూడా భయపడే వ్యక్తి కొండా మురళి కాదని పరోక్షంగా పలువురికి సవాలు విసిరారు.





టిటిపిఓసి-25లో పాల్గొన్న

# ప్రెప్ఇన్స్టా

- విద్యా వ్యవస్థ, పరిశ్రమల మధ్య అనుసంధానానికి వ్యూహాత్మక దిశ

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

భారతదేశంలోని ప్రముఖ ప్లేస్‌మెంట్ ప్రిపరేషన్, నైపుణ్యాభివృద్ధి వేదిక అయిన ప్రెప్ఇన్స్టా, జూన్ మొదటివారంలో షాద్నగర్‌లో జరిగిన కెరీర్ నెక్సస్ -2025లో హాజరైనది. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ కన్సోర్షియం (టిటిపిఓసి) ఏర్పాటు చేసింది. రెండు రోజుల పాటు సాగిన ఈ సదస్సు విద్యా సంస్థలు, కార్పొరేట్ నియామకదారుల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడానికి ప్రధాన వేదికగా నిలిచింది. దేశవ్యాప్తంగా వందలాదిమంది టీపీఓలు, హెచ్ ఆర్ అధిపతులు, ఎడ్టెక్ నేతలు మరియు పాలసీ మేకర్లు పాల్గొని, క్యాంపస్ ప్లేస్‌మెంట్లు మరియు నైపుణ్యాభివృద్ధి భవిష్యత్తును పునర్నిర్వచించాలనే లక్ష్యంతో చర్చించారు. ఈ చర్చల కేంద్రబిందువుగా, విద్యా శిక్షణ మరియు పరిశ్రమ అవసరాల మధ్య

మిగతా 4వ పేజీలో..

సంయమనం పాటిస్తున్నా..

# సహనాన్ని పరీక్షించొద్దు



**వేద న్యూస్, కరీంనగర్ ప్రతినిధి :**

గత బీఆర్ఎస్ హయాంలో అక్రమాలకు, ఆక్రమణలకు పాల్పడిన వారి భరతం పడతానని, ఎవరినీ వదిలే ప్రసక్తే లేదని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. శనివారం తిమ్మాపూర్ ఎల్ఎండీ కాలనీలో క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు ఆయన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతుంటే పనీ పాట లేని రసమయి బాలకిషన్, అతని అనుచరులు అడ్డగోలుగా ఆరోపణలు చేస్తూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నార న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత కాలంగా పథకం ప్రకారం అసత్యపు ఆరోపణలతో దుష్ప్రచారం కొనసాగిస్తున్నారని, అప్పుడప్పుడు ఖండించినా తీరుమార్చు కోవడం లేదన్నారు. ఇంతకాలం సంయమనం పాటిస్తూ వస్తున్నానని, ఇంకా సహనాన్ని పరీక్షించొద్దని కవ్వంపల్లి పేర్కొన్నారు. ఇక నుంచి ఎవరినీ వదిలి పెట్టే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు.

మిగతా 4వ పేజీలో..

# రూ.2500 కోసం వెయిటింగ్..!

- మహాలక్ష్మి అమలుపై మహిళలు ఆశలు
- పథకం అమలుకు లెక్కలు తీస్తున్న అధికారులు



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తుంది. ఇప్పటికే రైతు భరోసా నిధులు 9 వేల కోట్ల రూపాయలు విడుదల చేయడం,సన్న బియ్యం పథకం కార్యక్రమం ప్రారంభించి జనంలో అభిమానాన్ని పెంచుకుంది. అయితే ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా రేషన్ కార్డు కలిగి ఉన్న మహిళలకు నెలకు 2500 రూపాయలు “మహాలక్ష్మి పథకం” ప్రారంభించేందుకు కసరత్తులు చేస్తుంది. ఇప్పటికే అధికారులు లెక్కలు తీశారని విశ్వసనీయ సమాచారం తెలుస్తుంది. నల్లగొండ జిల్లాలో 5 లక్షల 5 వేల తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్నాయి. అయితే రేషన్ కార్డు యజమానురాలకు నెల నెల 2500 రూపాయలు జమ చేయనున్నారు. అతి త్వరలోనే ఈ పథకానికి శ్రీకారం చుట్టబోతున్నరని విశ్వసనీయ సమాచారం తెలుస్తుంది. దీంతో జిల్లాలో 4 లక్షల మందికి మహిళలకు లబ్ధి చేకూరనుంది. ఇటీవల మంత్రులు సైతం మహిళలకు మహాలక్ష్మి పథకం

## మెగా జాబ్ మేళా నిర్వహించిన ఎమ్మెల్యే



**వేద న్యూస్, మెట్ పల్లి ప్రతినిధి :**

జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని కటకం సంగయ్య ఫంక్షన్ హాల్ లో కోరుట్ల నియోజకవర్గం బిఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు సుమారు 67 కంపెనీలతో రెండువేలకు పైగా ఉద్యోగాలు యువతకు అందించేందుకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని అన్నారు. ఇందులో ఉద్యోగం పొందని వారు నిరాశ చెందకూడదని రానున్న కాలంలో స్కిల్ డెవలప్మెంట్ చేసి ఉద్యోగం పొందేందుకు ప్రత్యేకంగా కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి ఉద్యోగం పొందేలా తీర్చి దిద్దుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రత్యేకంగా మహిళలపై శ్రద్ధ చూపి వారిని అన్ని రంగాలలో రాణించేలా అవకాశాలు కల్పిస్తామని అన్నారు.

మాజీ ప్రధాని పీవీ నరసింహా రావుకి

## సీఎం ఘన నివాళులు




**వేద న్యూస్, హైదరాబాద్ :**

మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ పీవీ నరసింహా రావు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. బహుభాషా కోవిదుడు, రచయిత, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా పీవీ నరసింహా రావు దేశానికి అందించిన అమూల్యమైన సేవలను, భారతావనిని ప్రగతిపథంలో నడిపించడంలో ఆయన పాత్రను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. జూబ్లీ హిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో పీవీ చిత్రపటానికి నివాళులు అర్పించిన వారిలో సీఎం సలహాదారు వేం. నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు మందుల సామేల్, మట్టా రాగమయి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ఉన్నారు.

ప్రధాని మోదీకి ధర్మ

## చక్రవర్తి బిరుదు ప్రదానం



**వేద న్యూస్, డెస్క్:**

జైన సన్యాసి ఆచార్య శ్రీ 108 విద్యానంద జీ మహారాజ్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి “ధర్మ చక్రవర్తి” బిరుదు ప్రదానం చేశారు. ఈ గౌరవాన్ని ప్రధానమంత్రి మోదీ స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. “నేను దీనికి తగినవాడిని కాదని నేను

మిగతా 4వ పేజీలో..

వేద న్యూస్

ఆదివారం, జూన్ 29, 2025

# నోట్ బుక్స్ పంపిణీ

**వేద న్యూస్, మరిపెడ :**



మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం, గాలి వారి గూడెం, గ్రామంలోని అప్పర్ ప్రైమర్ స్కూల్, (యుపిఎస్ )లో అంబేద్కర్ పూలే మహాజన సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు చింత వెంకన్న ఆధ్వర్యంలో గాలి వారి గూడెం గ్రామంలోని,అప్పర్ ప్రైమర్ స్కూల్, (యుపిఎస్ )లో ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు చదువుతున్న, విద్యార్థిని విద్యార్థులకు మరిపెడ మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ శరత్ చంద్ర గౌడ్, ముఖ్యఅతిథిగా విచ్చేసి నోట్ బుక్స్ పంపిణీ చేయడం జరిగింది. అనంతరం మరిపెడ మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ శరత్ చంద్ర గౌడ్ మాట్లాడుతూ,ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థినీ విద్యార్థులకు చేయూతనివ్వడం అవుతుందని, మరింత శ్రద్ధగా చదువుకోవడానికి, ఈ నోట్ బుక్స్ సద్వినియోగం చేసుకొని, విద్యార్థిని, విద్యార్థులందరూ బాగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ పూలే మహాజన సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు చింత వెంకన్న,అంబేద్కర్ పూలే మహాజన సంఘం, కమిటీ సభ్యులు చింత దిలీప్, గాలి వారి గూడెం, అప్పర్ ప్రైమర్ స్కూల్, (యుపిఎస్) హెచ్ఎం, ఆర్,వెంకన్న, టీచర్స్, బి, మురళీధర్, ఎం, వీరన్న ,ఎస్ రాజేంద్ర, టి, సావిత్రి, ఏ, ప్రేమ్ కుమార్, రామకృష్ణ, నాగరాజు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# హిందీకి మేం వ్యతిరేకం కాదు..

## – ప్రైమరీ స్కూల్ స్థాయిలో వద్దు : శరద్‌పవార్

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



మహారాష్ట్ర ప్రజలు హిందీ భాషకు వ్యతిరేకం కాదని, అయితే 1 నుంచి 4 తరగతుల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తప్పనిసరిగా హిందీ నేర్చుకోవాలని నిబంధన విధించడం మాత్రం తగదని ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ అన్నారు. 5వ తరగతి నుంచి హిందీ నేర్చుకోవడం విద్యార్థులకే మంచిదన్నారు. భాషా వివాదాలపై శుక్రవారం పవార్ స్పందిస్తూ.. దేశంలో 55 శాతం మంది మాట్లాడే హిందీని అలక్ష్యం చేయలేమన్నారు. మరాఠా, ఇంగ్లిష్ మీడియం స్కూళ్లలో 1 నుంచి 5వ తరగతి వరకు హిందీని మూడోభాషగా బోధించాలని గత వారం మహారాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులతో వివాదం మొదలైంది. మహారాష్ట్ర విద్యార్థులపై హిందీని రుద్దే ప్రయత్నాన్ని తాము తీవ్రంగా ప్రతిఘటిస్తామని, జూలై 5, 7 తేదీల్లో విడివిడిగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని శివసేన (ఉద్ధవ్), మహారాష్ట్ర నవ నిర్మాణసేన పార్టీలు గురువారం ప్రకటించాయి. మరాఠీ మూలాలు రూపుమాపడానికి రాష్ట్ర ప్రభుత్వం భాషాపరమైన ఎమర్జెన్సీని విధిస్తోందని విమర్శలు చేశాయి.

## పీజీ వైద్య కళాశాల

# మంజూరు పట్ల హర్షం

## – బంజారా ఉద్యోగుల సంఘం

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడకు పీజీ వైద్య కళాశాల మంజూరు కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్ తెలిపారు.శనివారం మిర్యాలగూడలో విలేఖర్లతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా చరిత్రలో మొట్టమొదటి సారి పీజీ వైద్య కళాశాల మంజూరు అయిందని చెప్పారు.దీంతో మిర్యాలగూడ పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన అత్యున్నతమైన,అన్ని రకాల వైద్యం లభించబోతుందని చెప్పారు.పీజీ వైద్య కళాశాల మంజూరు చేసిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ,ఉమ్మడి జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నల్లమాద ఉత్తంకుమార్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. పీజీ వైద్య కళాశాల మంజూరు చేయించేందుకు కృషి చేసిన మిర్యాలగూడ నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి,ఎమ్మెల్సీ కేతవత్ శంకర్ నాయక్ లకు అభినందనలు తెలిపారు.

# సార్వత్రిక సమ్మె..నిరసన ప్రదర్శనలు జయప్రదం చేయండి

**వేద న్యూస్, ములుగు :**




కేంద్ర ప్రభుత్వ కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను తిప్పికొడుతూ జూలై 9న సార్వత్రిక సమ్మె నిరసన ప్రదర్శనలు జయప్రదం చేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. శనివారం ములుగులో జరిగిన జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ద్వితీయ మహాసభ ఇంజం కొమురయ్య అధ్యక్షతన జరగగా ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రాములు ప్రసంగిస్తూ సుదీర్ఘ పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక హక్కుల్ని కాలరాసి,నాలుగు లేబర్ కోడ్ల్ తెచ్చి కార్మిక వర్గానికి తీర నిద్రోహం చేస్తున్నారన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేసి రైతాంగ సమస్యలు పరిష్కరించాలన్నారు. సమగ్ర కేంద్ర వ్యవసాయ కార్మిక చట్టాన్ని చేయాలని పేదలకు సాగు భూములు ఇండ్ల స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలని, 200 రోజులు ఉపాధి పనులు కలిగించి రోజుకు 700 కూలీ ఇవ్వాలని 55 సంవత్సరాలు నిండిన కూలీలకు నెలకు రూ.6 వేలు పెన్షన్ ఇవ్వాలని అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇచ్చి బియ్యంతో సహా 14 రకాల నిత్యావసరసరుకులు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సమర శంఖం పూరించేందుకు సార్వత్రిక సమ్మె నిరసన ప్రదర్శనలలోప్రజలందరు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎండి అమ్జద్ పాషా తదితరులు ప్రసంగించారు.కాగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులుగా పంగ యుగంధర్,ఉపాధ్యక్షులుగా ఇంజం కొమురయ్య, ప్రధాన కార్యదర్శిగా జక్కుల ఐలయ్య, సహాయ కార్యదర్శిగా జంపాల శ్రీనివాస్, మట్టెవాడ శ్రీనివాస్, కోశాధికారిగా మాతంగి శ్యామ్ సుందర్ లు ఎన్నికైనారు.

# అది నిజం కాదు : ట్రంప్



**వేద న్యూస్, డెస్క్:**

ఇరాన్ పౌర అణు కార్యక్రమానికి మద్దతుగా అమెరికా సుమారు 30 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.2.5 లక్షల కోట్లు) ఆర్థిక సహాయం అందించేందుకు సిద్ధమైందంటూ అంతర్జాతీయ మీడియాలో వచ్చిన కథనాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, అవన్నీ నిరాధారమైనవని ఆయన కొట్టిపారేశారు. ఇదంతా 'ఫేక్ న్యూస్ మీడియా' సృష్టిస్తున్న కల్పిత కథనమని ఆయన మండిపడ్డారు. ఇటీవల ఓ ప్రముఖ వార్తా సంస్థ ప్రచురించిన కథనం ఈ ప్రచారానికి కారణమైంది. ఇరాన్‌తో కొత్త దౌత్య ఒప్పందం కోసం ట్రంప్ కార్యవర్గం ప్రయత్నిస్తోందని ఆ కథనంలో పేర్కొన్నారు. దీని ప్రకారం పశ్చిమాసియాలోని ఇరాన్‌కు చెందిన మూడు అణు కేంద్రాలపై అమెరికా దాడులు జరిపిన తర్వాత, శ్వేతసౌధంలో కీలక సమావేశం జరిగినట్లు తెలిసింది. ఈ భేటీలో ట్రంప్ పశ్చిమాసియా ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్‌తో పాటు పలు గల్ఫ్ దేశాల ప్రతినిధులు కూడా పాల్గొన్నారని కథనం వివరించింది. ఈ సమావేశం జరుగుతున్న సమయంలోనే కొందరు ప్రతినిధులు ఇరాన్‌లోని కీలక నేతలతో ఫోన్‌లో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. ఇరాన్ పౌర అణు కార్యక్రమాన్ని పునరుద్ధరించేందుకు 20 నుంచి 30 బిలియన్ డాలర్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ భారీ మొత్తంలో కొంత భాగాన్ని అరబ్ దేశాలు భరించాలని అమెరికా ఆశిస్తున్నట్లు ఆ కథనంలో తెలిపారు. ఎలాగైనా టెహ్రాన్‌ను చర్చల వేదికపైకి తీసుకురావాలనే లక్ష్యంతోనే అమెరికా ఈ ప్రయత్నాలు చేస్తుందనేది ఆ కథనం యొక్క సారాంశం. అయితే, ఈ మొత్తం వ్యవహారంపై అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇరాన్‌కు ఆర్థిక సహాయం అందిస్తున్నామనే వార్తలను ఆయన పూర్తిగా తోసిపుచ్చారు. ఇలాంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దని, ఇదంతా కేవలం ఫేక్ న్యూస్ సంస్థలు ఉద్దేశపూర్వకంగా అల్లిన కథనమని ఆయన స్పష్టం చేశారు.

# పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే

**వేద న్యూస్, కమలాపూర్ :**




## – బి కమలాపూర్ ఎంపీడీవో గుండె బాబు

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ లో శనివారం రోజున జరిగిన అన్యువల్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమలాపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుండె బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదువుకోవాలని, పట్టుదల ఉంటే అన్ని సాధించవచ్చని అన్నారు. తాము చదువుకునే వయసులో ఉన్నప్పుడు కేవలం చదువులోనే కాకుండా ఆటపాటలు అన్ని విషయాల్లో ముందుండే వాళ్ళమని ఆడే సమయంలో ఆడే వాళ్ళమని, చదువుకునే సమయంలో మాత్రం చాలా ఆసక్తితో, శ్రద్ధతో చదువుకునే వాళ్ళమని, చదువును ఎట్టి పరిస్థితుల్లో కూడా నిర్లక్ష్యం చేసే వాళ్ళం కాదని ఆరోజు అలా చేసాం కాబట్టే నేడు మీ ముందు ఇక్కడ ఇలా నిలబడ్డాను అని పాత రోజులు గుర్తు చేసుకున్నారు. ఈ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అందరూ గొప్ప గొప్ప చదువులు చదువుకొని రాష్ట్రస్థాయిలో పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారని, వారు విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకుంటారని, వారికి విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలనే ఆలోచన తప్ప మరొక ఆలోచన ఉండదని కాబట్టి విద్యార్థులంతా అది అర్థం చేసుకొని వారు చెప్పిన విధంగా నడుచుకోవాలని అన్నారు. చదువు విలువ గురించి ఎంపీడీవో ఒక విషయం గురించి ఉదహరిస్తూ తన చిన్ననాటి స్నేహితుడు ఆ సమయంలో చదువు పట్ల నిర్లక్ష్యం చేశాడని కానీ ఆ తర్వాత చదువు విలువ తెలిసి తన కూతురిని బాగా చదివిస్తే ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించిందని అది చదువు యొక్క గొప్పతనం అని ఈ విషయం విద్యార్థులంతా అర్థం చేసుకోవాలని కోరారు. అనంతరం ఇంటర్ ఫస్టియర్ లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో రాణించిన క్రీడాకారులకు ఎంపీడీవో షీల్డ్ లు బహుకరించారు. మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మంచి ర్యాంకులు సాధించాలని, రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించే సత్తా మోడల్ స్కూల్ విద్యార్థుల్లో ఉందని తాను నమ్ముతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులు కూడా తన మాదిరిగా స్టేజ్ పై మాట్లాడే స్థాయికి, అంతకంటే గొప్ప స్థాయికి కూడా ఎదగాలని, ఎదుగుతారని ఎంపీడీవో గుండె బాబు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కుల్లా క్రమంలో భద్రకాళి అమ్మవారు

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

చరిత్ర ప్రసిద్ధిగాంచిన వరంగల్ మహానగరంలోని పరమపావనమైన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ భద్రకాళి దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవములు మూడవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవతో ప్రారంభమైన నిత్యాహ్నికం, క్షీరాన్న నివేదన నీరాజన మంత్ర పుష్పములతో ముగిసింది. శాకంభరీ ఉత్సవ నిర్వహణలోని మూడవ రోజు కార్యక్రమంలో భాగంగా అమ్మవారి దశ మహావిద్యలలోని కాళీ క్రమాన్ని అనుసరించి మరియు షోడశీ క్రమాన్ని అనుసరించి ఉదయం "కుల్లా" గా మరియు సాయంకాలం లి"నిత్యక్లిన్నా" గాను అమ్మవారిని అలంకరించి నవరాత్ర విశేష పూజలు నిర్వహించారని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు."కుం" లాతీతి "కుల్లా"లి భూమిని ఉద్ధరించింది కాబట్టి అమ్మవారిని కుల్లాగా పిలుస్తారు. రాక్షసుల భారినుండి వరాహమూర్తి రూపంలో నారాయణుడు భూమిని తన కోరలపైకి ఎత్తుకొని రాక్షస సంహారం చేసి ఈ భూమండలాన్ని కాపాడారు.

నారాయణమూర్తిలోని ఆ వారాహి శక్తియే ఈ కుల్ల మాత. భూమండలాన్ని ఉద్ధరించి సకల సస్యాభివృద్ధి ఫలాది వృక్ష సమూహములను వృద్ధి చేసి అసురీ శక్తులనుండి సమస్త ప్రాణికోటిని రక్షించి పెంచి పోషిస్తుంది ఈ తల్లి. ఈమెను ఆరాధించిన వారికి శత్రుబాధ తొలగిపోతుంది. ఇదే ఫలితాన్ని



షోడశీ క్రమంలోని నిత్యక్లిన్నా అమ్మవారు ఇతోధికంగా ఇస్తుంది.

# సంపాదకీయం

## విదేశీ విశ్వవిద్యాలయాలతో విద్యకు ముప్పు?

ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఐదు విశ్వవిద్యాలయాలు జాతీయ విద్యావిధానం 2020కి అనుగుణంగా, యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనలు 2023 ప్రకారం భారతదేశంలో క్యాంపస్‌లను స్థాపించడానికి సిద్ధమవుతున్నందున, భారతీయ ఉన్నత విద్యలో పరివర్తనాత్మక మార్పు జరుగుతోంది. ఇల్లినాయిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, యూనివర్శిటీ ఆఫ్ లివర్‌పూల్, విక్టోరియా యూనివర్శిటీ, వెస్ట్రన్ సిడ్నీ యూనివర్శిటీ, ఇన్‌స్టిట్యూట్ యూరోపియో డి డిజైన్ (ఇటలీ) 2026- 2027 మధ్య కార్యకలాపాలను ప్రారంభిం చనున్నారు.యుజిసి ఆమోదం పొందిన మొదటి విదేశీ విశ్వవిద్యాలయంగా 2025 ఆగస్టులో గురుగ్రామ్ క్యాంపస్‌ను ప్రారంభించనున్నది సౌతాంప్టన్ విశ్వవిద్యాలయం. ఈ విదేశీ క్యాంపస్‌లు భారతదేశ విద్యారంగాన్ని మెరుగుపరుస్తాయా లేదా దాని ఉన్నత విద్యా వ్యవస్థకు ముప్పు కలిగిస్తాయా అని మేధావుల్లో చర్చకు దారితీసింది. భారతీయ విద్యార్థులకు విదేశీ విశ్వవిద్యాలయాల రాక గణనీయమైన ప్రయోజనాలను హామీ ఇస్తున్నది. అగ్రశ్రేణి సంస్థలు అధిక -నాణ్యతగల పాఠ్యాంశాలు, ప్రపంచ బోధనా పద్ధతులు, పరిశోధన అవకాశాలను అందించగలవు. భారత దేశంలో ప్రపంచస్థాయి ఉన్నతవిద్యాసంస్థల కొరతను పరిష్కరిస్తాయి. ప్రస్తుతం ఐఐటిలు, ఐఐఎంలు వంటి ఉన్నత సంస్థలు మాత్రమే ప్రపంచ వ్యాప్తంగా పోటీపడుతున్నాయి. విద్యార్థులు విదేశాలలో చదువుకోవడం కంటే తక్కువ ఖర్చుతో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన డిగ్రీలను పొందగలుగుతారు. ఆర్థిక భారాన్ని తగ్గిస్తారు, 2022లో 6,50,000 మంది భారతీయ విద్యార్థులు విదేశాలలో చదువుతున్నందున రూ. 1.3 లక్షల కోట్ల వార్షిక ప్రవాహాన్ని నివారిస్తారు. ఈ క్యాంపస్‌లు 2022లో దాదాపు 1 మిలియన్ భారతీయ విద్యార్థులు విదేశాల్లో చదువుతున్నందున మేధోవలస కూడా అరికట్టగలవు. 2024 నాటికి 80 బిలియన్ల డాలర్లకు చేరుకుంటాయని అంచనా వేయబడిన ఆర్థిక వనరులను నిలుపుకోగలవు. ఐఐటి ఢిల్లీ క్వీన్స్‌ల్యాండ్ విశ్వవిద్యాలయంతో భాగస్వామ్యం వంటి సహకార కార్యక్రమాలు ఆవిష్కరణను ప్రోత్సహిస్తాయని భావిస్తున్నారు.

గుజరాత్‌లోని జిఐఎఫ్‌టి సిటీ వంటి కేంద్రాలు పన్ను మినహాయింపులు అందిస్తూ డీకిన్ విశ్వవిద్యాలయం వంటి సంస్థలు ఆకర్షిస్తున్నాయి. అంతేకాకుండా, విదేశీ విశ్వవిద్యాలయాలు అంతర్జాతీయ అధ్యాపకులు, పరిశ్రమ- సమలేఖన కార్యక్రమాలను అందించడం ద్వారా, ప్రపంచ మార్కెట్లకు విద్యార్థులను సిద్ధం చేయడం ద్వారా ఉపాధిని పెంచుతాయి. ఇంటి నుండి బయటకు వెళ్లకుండా ప్రపంచస్థాయి విద్యను కోరుకునే భారతీయ విద్యార్థులకు ఇది గేమ్- ఛేంజర్. అయితే, విద్య పరిరక్షణ నేతలు, విమర్శకులు సంభావ్య ప్రమాదాల గురించి హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు రూ. 10,000, రూ. 50,000తో పోలిస్తే సంవత్సరానికి రూ. 10 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు అంచనా వేయబడిన అధిక ట్యూషన్ ఫీజులు సంపన్న విద్యార్థులకు ప్రాప్యతను పరిమితం చేస్తాయి, ప్రాథమిక, ఉన్నత విద్యను పొందేందుకు చాలా మంది కష్టపడుతున్న దేశంలో అసమానతలను తీవ్రతరం చేస్తాయి. స్కాలర్ షిప్‌లు లేదా నిశ్చయాత్మక చర్యలు లేకుండా వరుసగా 25.9%, 21.2% నమోదు రేట్లు కలిగిన షెడ్యూల్డ్ కులాలు, తెగలు వంటి అట్టడుగు వర్గాలు ఉన్నత విద్యకు దూరమవుతారు. భారతదేశంలోని విదేశీ క్యాంపస్‌లు దేశీయంగా ప్రతిభను, అలాగే వనరులను నిలుపుకునే సామర్థ్యాన్ని నొక్కి చెబుతున్నాయి. అయితే, భారతదేశంలో 40 మిలియన్ల ఉన్నత విద్య విద్యార్థులు కొంత భాగాన్ని మాత్రమే అందించే వాటి పరిమితి స్థాయి వాటి ప్రభావాన్ని పరిమితం చేయవచ్చు. భారతదేశంలో విదేశీ విశ్వవిద్యాలయాల విజయం వ్యూహాత్మక నియంత్రణపై ఆధారపడి ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. నష్టాలను తగ్గించడానికి, ప్రభుత్వం అవసరాల ఆధారిత స్కాలర్‌షిప్‌లను అమలు చేయాలి. పెరిగిన నిధులతో ప్రభుత్వ సంస్థలను బలోపేతం చేయాలి. ఉన్నత స్థాయి విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. విద్యా అంతరాలను పరిష్కరించడం కూడా చాలా కీలకం. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు రూ. 10,000, రూ. 50,000తో పోలిస్తే సంవత్సరానికి రూ. 10 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు అంచనా వేయబడిన అధిక ట్యూషన్ ఫీజులు సంపన్న విద్యార్థులకు ప్రాప్యతను పరిమితం చేస్తాయి, ప్రాథమిక, ఉన్నత విద్యను పొందేందుకు చాలా మంది కష్టపడుతున్న దేశంలో అసమానతలను తీవ్రతరం చేస్తాయి. స్కాలర్ షిప్‌లు లేదా నిశ్చయాత్మక చర్యలు లేకుండా వరుసగా 25.9%, 21.2% నమోదు రేట్లు కలిగిన షెడ్యూల్డ్ కులాలు, తెగలు వంటి అట్టడుగు వర్గాలు ఉన్నత విద్యకు దూరమవుతారు. భారతదేశంలోని విదేశీ క్యాంపస్‌లు దేశీయంగా ప్రతిభను, అలాగే వనరులను నిలుపుకునే సామర్థ్యాన్ని నొక్కి చెబుతున్నాయి. అయితే, భారతదేశంలో 40 మిలియన్ల ఉన్నత విద్య విద్యార్థులు కొంత భాగాన్ని మాత్రమే అందించే వాటి పరిమితి స్థాయి వాటి ప్రభావాన్ని పరిమితం చేయవచ్చు. భారతదేశంలో విదేశీ విశ్వవిద్యాలయాల విజయం వ్యూహాత్మక విదేశీ విశ్వవిద్యాలయాల ప్రవేశం అంతర్గతంగా ముప్పు కాదు కానీ జాగ్రత్తగా పర్యవేక్షణ అవసరం. సరైన విధానాలతో ఇది భారతీయ ఉన్నత విద్యను ప్రపంచ కేంద్రంగా మార్చగలదు. భారతదేశం ఈ విద్యాపరమైన కూడలిలో ఉన్నందున, రాబోయే సంవత్సరాలు భవిష్యత్తును నిర్ణయిస్తాయి.

## గ్యాంగ్ రేప్ ఘటనపై వైద్య
# నివేదికలో షాకింగ్ నిజాలు!



**వేద న్యూస్, డెస్క్:**

పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో న్యాయ విద్యార్థినిపై జరిగిన సామూహిక అత్యాచార ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. పెళ్లి ప్రతిపాదనను తిరస్కరించిందనే కక్షతోనే ప్రధాన నిందితుడు, అధికార టీఎంసీ విద్యార్థి విభాగం నేత ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ కేసులో ఇప్పటికే ప్రధాన నిందితుడితో పాటు మరో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. బాధిత విద్యార్థినికి నిర్వహించిన వైద్య పరీక్షల్లో ఒళ్లు గగుర్పొడిచే వాస్తవాలు వెలుగుచూశాయి. ఆమెపై సామూహిక అత్యాచారం జరిగినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నిందితులు అత్యంత పాశవికంగా ప్రవర్తించినట్లు రిపోర్టులో తేలింది. “బాధితురాలి మెడ, ఛాతీ భాగాలపై పదునైన పంటి గాట్లు ఉన్నాయి. గోళ్లతో రక్కిన ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆమె వ్యక్తిగత అవయవాలను కూడా తీవ్రంగా గాయపరిచారు” అని ఓ సీనియర్ పోలీసు అధికారి మీడియాకు వివరించారు. ఈ నెల 25న కస్బా ప్రాంతంలోని సౌత్ కోల్‌కతా లా కళాశాలలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది.

**- సెక్యూరిటీ గదిలో బంధించి**

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్న బాధితురాలిని నిందితులు సెక్యూరిటీ సిబ్బంది గదిలోకి లాక్కెళ్లి బంధించారు. అనంతరం ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. వారి బారి నుంచి తప్పించుకోవడానికి బాధితురాలు ప్రయత్నించగా, హాకీ స్టిక్‌తో ఆమెపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ దారుణాన్ని బయటకు చెబితే, ఆమె తల్లిదండ్రులపై తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపుతామని ప్రధాన నిందితుడు బెదిరించినట్లు బాధితురాలు తన వాంగ్మూలంలో పేర్కొంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు మోనోజిత్ మిశ్రా (31) అదే కళాశాల పూర్వ విద్యార్థి. ప్రస్తుతం న్యాయవాదిగా పనిచేస్తూ, అదే కాలేజీలో ఒప్పంద అధ్యాపకుడిగా కూడా కొనసాగుతున్నాడు. అతనికి తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. టీఎంసీ విద్యార్థి విభాగానికి దక్షిణ కోల్‌కతా జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. దీంతో ఈ ఘటన రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఈ కేసులో మిశ్రాతో పాటు ఇద్దరు సీనియర్ విద్యార్థులను, వారికి సహకరించిన కాలేజీ సెక్యూరిటీ గార్డును కూడా పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఈ కేసులో అరెస్టయిన వారి సంఖ్య నాలుగుకు చేరింది. ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది.

## ఎన్ని దాడులు చేసినా
# పాకిస్థాన్ బుద్ధి మారదు




**వేద న్యూస్, డెస్క్:**


ఎన్ని దాడులు చేసినా, ఎంత నష్టం వాటిల్లినా పాకిస్థాన్ తన బుద్ధిని మాత్రం మార్చుకోవడం లేదు. భారత్‌పై విషం కక్కడాన్ని మానుకోదు. ఉగ్రవాదం విషయంలో భారత్ చేతిలో చావుదెబ్బ తిన్నప్పటికీ పాక్ తన తీరును మార్చుకోవడం లేదు. ఉగ్రవాదాన్ని పెంచి పోషించడంలో వెనకడుగు వేయడం లేదు. ఆపరేషన్ సిందూర్ లో దెబ్బతిన్న టెర్రరిస్ట్ లాంఛ్ ప్యాడ్స్‌ను పాకిస్థాన్ మళ్లీ తిరిగి నిర్మిస్తున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి.

పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ ప్రతికారం తీర్చుకుంది. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలు, ట్రైనింగ్ క్యాంపులను బాంబులు, మిసైళ్లతో నాశనం చేసింది. భారత్ దాడి వల్ల పాక్, పీఓకేలోని ఉగ్ర స్థావరాలు, టెర్రరిస్ట్ లాంఛ్ ప్యాడ్స్ దారుణంగా దెబ్బతిన్నాయి. దాదాపుగా తుడిచిపెట్టుకుపోయాయి. ఇంత జరిగినా పాక్ బుద్ధి తెచ్చుకోలేదు. భారత్ దాడిలో దెబ్బతిన్న ఉగ్రస్థావరాలను పాక్ తిరిగి నిర్మిస్తోందని భారత్ నిఘా వర్గాలకు సమాచారం అందినట్టు తెలుస్తోంది.

# అండమాన్ సముద్రంలో భారీ భూకంపం!

**వేద న్యూస్, డెస్క్:**

అండమాన్ సముద్రంలో భారీ భూకంపం సంభవించింది. శనివారం తెల్లవారుజామున ఒక్కసారిగా భూమి కంపించింది. రిక్టరు స్కేలు పై భూకంపం తీవ్రత 4.6గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. భూమికి 25 కిలోమీటర్ల లోతులో ఈ భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్లు పేర్కొంది. అండమాన్, నికోబార్ దీవులలోని పోర్ట్‌బ్లెయిర్‌కు 254 కి.మీ ఆగ్నేయంలో ఈ భూకంపం సంభవించినట్టు తెలుస్తోంది. ఈ భూ ప్రకంపనలతో సముద్రం ఒక్కసారిగా అల్లకల్లోలంగా మారింది. దీని తీవ్రతకు తీర ప్రాంతాల్లో కూడా భూ ప్రకంపనలు ఏర్పాడ్డాయి. దీంతో స్థానిక ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కపడ్డారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా ఇటీవలే జూన్ 25న




అండమాన్ సముద్రంలో భూకంపం సంభవించింది. అప్పుడు రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్ర 4.2గా నమోదైంది. అప్పుడు కూడా సుమారు సముద్ర నుంచి 20 కిలోమీటర్లలోపుతో భూకంప కేంద్రం ఏర్పడింది. మరోవైపు శనివారం దక్షిణ ఫిలిప్పీన్స్‌లో కూడా భూకంపం సంభవించిందని రాష్ట్ర జియోలాజికల్ సర్వే తెలిపింది. అక్కడ భూకంప తీవ్రత 6.1గా నమోదైనట్టు తెలిపింది. ఈ భూకంపం వల్ల ఎలాంటి ప్రాణనష్టం అయితే జరగలేదని స్పష్టం చేసింది.

## ఛార్జీల పెంపుపై
# కేంద్రమంత్రి క్లారిటీ

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

రైల్వే ప్రయాణికులకు కేంద్రం ఊరటనిచ్చే వార్త చెప్పింది. దేశంలో రైల్వే ఛార్జీలను స్వల్పంగా పెంచబోతున్నట్టు ఇటీవలే రైల్వేశాఖ నిర్ణయం తీసుకుందంటూ వచ్చిన వార్తల నేపథ్యంలో దీనిపై కేంద్ర రైల్వే సహాయ మంత్రి వి.సోమన్న స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వే ప్రయాణికులపై ప్రభావం పడకుండా దశలవారీగా టికెట్ ధరలను పెంచే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిపారు. ఒక్కసారిగా ఛార్జీల పెరుగుదల ఉండకపోవచ్చని.. క్రమంగా క్రమంగా ఈ ఛార్జీలను పెంచే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఈ విషయంపై ఇంకా చర్చ జరుగుతోందని, టికెట్ ధరలను దశల వారీగానే పెంచేందుకు రైల్వేశాఖ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా చెన్నైకి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ప్రతిపాదన నేపథ్యంలో పరందూర్‌లో రైల్వే స్టేషన్ నిర్మాణం చేపట్టే అంశంపై ఆయన స్పందించారు. ఈ విషయంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని.. దీనిపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నట్టు మంత్రి సోమన్న తెలిపారు.

# ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయలేదెందుకు?

**వేద న్యూస్, డెస్క్:**

దేశాభివృద్ధికి ఒక ముఖ్యమైన కొలమానం యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పించడం. తద్వారా ప్రజల జీవన ప్రమాణాలను పెంచడం. గత దశాబ్దకాలంగా అన్ని రంగాల్లో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు గణనీయంగా తగ్గిపోయాయి. నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ (ఎన్ఎస్-ఎస్ఓ) గత నాలుగున్నర దశాబ్దాల్లో ఇంతటి భారీ స్థాయిలో నిరుద్యోగం ఎన్నడూ లేదని స్పష్టంగా తన నివేదికలో తెలిపింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎల్ఐసి, ఇండియన్ రైల్వేస్ వంటి సంస్థల్లో లక్షలాది ఖాళీలు భర్తీ కాకుండా ఉండిపోయాయి. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో సుమారు పది లక్షల ఖాళీలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వమే స్వయంగా పార్లమెంటుకు తెలిపింది. దేశ సరిహద్దుల్లో కాపలా కాస్తూ, దేశం లోపల విపత్తులు సంభవించిన సమయాల్లో ఆదుకునే దేశ రక్షణ (ఆర్మీ) వ్యవస్థలో సైతం లక్షన్నరకు పైగా ఖాళీలు ఉన్నాయని మీడియాలో వార్తలు వచ్చాయి. అగ్నిపథ్ పథకం ఒక విఫల ప్రయోగం. హడావిడిగా దీన్ని ఏర్పాటు చేయడం, దీనిపై వస్తున్న విమర్శల్ని పట్టించుకోక పోవడం, కనీసం సమీక్ష కూడా చేయకపోవడం కేంద్ర ప్రభుత్వానికే చెల్లింది! అగ్నివీర్ల సర్వీస్‌ను కేవ లం నాలుగేండ్ల వ్యవధికి పరిమితం చేయడం సరైంది కాదు. అతి తక్కువ కాలం మాత్రమే సేవలం దించి ఆ తర్వాత వాళ్లు ఏ రకంగా స్థిరపడగలరు? దేశ వ్యాప్తంగా వివిధ యూనివర్సి టీలు, కళాశాలలు, పాఠశాలలతో సహా మొత్తం విద్యారంగంలో అధ్యా పక, ఉపాధ్యాయ పోస్టులు లక్షల సంఖ్యలో ఖాళీగా ఉన్నాయి.

దేశంలోని అనేక రంగాల్లో లక్షలాది మంది ఉద్యోగులు, కార్మికులు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతుల్లో పని చేస్తున్నారు. వీరిలో అనేక మందికి నియామక పత్రాలు కూడా లేవు. లక్షలాది మంది తాత్కాలిక ఉద్యోగులకు పెన్షన్, పి.ఫ్, ఆరోగ్య బీమా వంటి కనీస సౌకర్యాలు కొరవడి పలు ఇబ్బందులు పడుతున్నారు. అనేక విద్యా సంస్థల్లో కాంట్రాక్టు పద్ధతుల్లో ప్రొఫెసర్లు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పని చేస్తున్నారు. శాశ్వత ఉద్యోగాలు కాకుండా తుమ్మితే ఊడిపోయే విధంగా ఉద్యోగాలు ఉంటే ఆయా సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికుల నుండి అంకిత భావం, చిత్తశుద్ధి ఎలా ఆశించగలం? యూపీఏ-1 ప్రభుత్వ హయాం నుండి అమలవుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం దేశానికి ఎంతో మేలు చేసింది. కొన్ని రాష్ట్రాల్లో ఈ పథకం అమల్లో లోపాలు ఎదురైనప్పటికీ, దీన్ని మరింత పటిష్టం చేసి ఏడాదికి కనీసం రూ 2 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయింపులు చేయగలిగితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. దేశాభివృద్ధి ప్రక్రియలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కీలకం. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఈ ప్రాధాన్యతను ఏ మాత్రం గుర్తించడం లేదు. అవసరమైన నిధులూ ఇవ్వడం లేదు. పైగా గ్రామీణ ఉపాధి హామీని అన్ని పట్టణాలకు విస్తరింప చేయాలని జాతీయ ఉద్యోగ, కార్మిక సంఘాలు ఎప్ప టినుంచో కోరుతున్నా, దానిపై నోరుమెదపడం లేదు.




కేంద్ర ప్రభుత్వ స్టాటిస్టిక్స్ మంత్రిత్వశాఖ ఇటీవల విడుదల చేసిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే డేటా ప్రకారం మే, 2025లో 15-29 సంవత్సరాల వయస్సు ఉన్న గ్రామీణ యువతలో నిరుద్యోగం రేటు 13.7 శాతానికి, అదే అర్బన్ యువతలో 17.9 శాతానికి పెరిగింది. మహిళల్లో అయితే నిరుద్యోగం 5.8 శాతానికి పెరిగింది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ ఇచ్చిన నివేదిక గత దశాబ్ద కాలంలో మొత్తం దేశం యువతలో నిరుద్యోగ రేటు 22 శాతానికి చేరుకుందని పేర్కొంది. మరో పక్క సాఫ్ట్ వేర్ రంగంలోని పరిస్థితులు కూడా ఏమంత సజావుగా లేవు. ఉద్యోగాల భద్రత కొరవడింది. పలు ఐ.టి కంపెనీలు తమ ఉద్యోగుల సంఖ్యను తగ్గించేశాయి. సాంకేతిక పరిజ్ఞానం కేంద్రీకృతమవు తోంది. పలు కంపెనీల్లో వేతన స్తంభన నెలకొన్నది. దేశ సంపద పెరిగింది. కానీ అభివృద్ధి ఫలాలు దేశ ప్రజలందరికీ దక్కడం లేదు. ఇది మన వ్యవస్థ ప్రధాన వైఫల్యం. ప్రపంచంలో మన దేశ జీడీపీ ఏ స్థానానికి చేరుకున్నదనే దానికన్నా, ప్రజల ఆదాయాలు, పౌష్టికాహారం, విద్య,ఆరోగ్య సంరక్షణ, ఉపాధి కల్పన వంటి ముఖ్యమైన అంశాలను మాత్రమే దేశ ప్రగతి విషయంలో ప్రమాణికాలుగా తీసుకోవాలి. ఈ నేపథ్యంలో వివిధ రంగాలకు చెందిన లక్షలాది మంది ఉద్యోగులు, కార్మికులకు దేశంలో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పించాలి. ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు ఉపాధి కొరత సమస్యను అధిగమించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. ఈ సమస్యల పరిష్కారానికి కార్మిక సంఘాలు జూలై 9వ తేదీన దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చాయి. ప్రజలు, ప్రజాతంత్రవాదులు, విద్యార్థులు, మేధా వులు సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలి.

వేద న్యూస్

ఆదివారం, జూన్ 29, 2025

# టిటిపిపిఓసి-25 లో పాల్గొన్న ప్రెప్ఇన్స్టా

పెరుగుతున్న అంతరాన్ని పరిగణించడమే జరిగింది. ప్రెప్ఇన్స్టా సీనియర్ డైరెక్టర్ మనీష్ అగర్వాల్ మాట్లాడుతూ, "భారతదేశంలో ప్లేస్‌మెంట్ లాండ్‌స్కేప్ వేగంగా మారుతోంది. ప్రతి సంవత్సరం లక్షలాది మంది గ్రాడ్యుయేట్లు తయారవుతున్నా, పరిశ్రమ ప్రమాణాలకు అనుగుణంగా ఉద్యోగానికి సిద్ధంగా ఉండే వారి శాతం చాలా తక్కువగా ఉంది. ఈ అంతరాన్ని తగ్గించాలంటే, టిపిఓ లు, కంపెనీ హెచ్ఆర్ లు కలిసి పని చేయాలి. శిక్షణ, అంచనా, నియామకం అన్నీ ఒకే వేదికపై కలిసేలా ప్లాట్‌ఫారాలు నిర్మించాలి. ఇది విద్యార్థుల విజయాన్ని పటిష్టంగా మద్దతిచ్చే ప్లేస్‌మెంట్ పద్ధతుల తరం కావాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో చర్చించిన ముఖ్య సమస్యలు ఈ విధంగా ఉన్నాయి. క్యాంపస్ శిక్షణలో ప్రమాణాల లోపం, పాత విధానాల ఆధారంగా ప్లేస్‌మెంట్ ట్రాకింగ్, టీపీఓ లు, నియామకదారుల మధ్య తక్కువ కమ్యూనికేషన్, టియర్ 2 టియర్ 3 కాలేజీలలో తక్కువ ప్లేస్‌మెంట్ శాతం వంటివి ఉన్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి, ప్రెప్ఇన్స్టా సహకారాత్మక, డేటా ఆధారిత దృక్పథాన్ని ప్రతిపాదించింది. దీని ద్వారా కాలేజీలు పటిష్టమైన డేటా, స్కేలబుల్ టూల్స్, మరియు బలమైన రిక్రూటర్ నెట్‌వర్క్‌ను పొందగలుగుతాయి. "ప్రెప్ఇన్స్టాలో, లక్ష్యం ఏమిటంటే విద్యార్థి ఏ కాలేజ్‌లో చదువుతున్నా, అతనికి సరైన శిక్షణ, మార్గనిర్దేశం మరియు ఉద్యోగ అవకాశాలు అందాలి. టిటిపీఓసి వంటి ఈవెంట్‌లు విద్యా వ్యవస్థతో కలసి భవిష్యత్ కోసం సమగ్ర పరిష్కారాలను రూపకల్పన చేసే అవకాశాలు కల్పిస్తాయి" అని మానిష్ అగర్వాల్ తెలిపారు. ఈ దిశగా, ప్రెప్ఇన్స్టా భారత దేశవ్యాప్తంగా ఉన్న కాలేజీల టిపిఓలు మరియు మేనేజ్‌మెంట్‌లను 2025 ప్లేస్‌మెంట్ సీజన్ కోసం వ్యూహాత్మక భాగస్వామ్యాలను అన్వేషించమని ఆహ్వానిస్తోంది. ప్రెప్ఇన్స్టా రూపొందించిన బి2బి సాస్ ప్లాట్‌ఫారమ్ 'ఆప్టిమస్' ఇప్పటికే 250కి పైగా విద్యాసంస్థలకు మద్దతు ఇస్తోంది. శిక్షణ, అంచనా ప్రిపరేషన్ ట్రాకింగ్‌ను సమర్థంగా నిర్వహిస్తోంది. 2017లో స్థాపితమైన ప్రెప్ఇన్స్టా, నైపుణ్యాల అభివృద్ధి మరియు ప్లేస్‌మెంట్ కోసం విశ్వసనీయ వేదికగా ఎదిగింది. ఇందులో 200కి పైగా ఇండస్ట్రీ–అలైన్డ్ కోర్సులు ఉన్న ప్రైమ్ సబ్‌స్క్రిప్షన్ ఉంది. ఇందులో జనరేటివ్ ఏ ఐ, మెషీన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి హై–డిమాండ్ రంగాలలో శిక్షణ అందించబడుతుంది. నైపుణ్యాధారిత, ఉపాధి–సిద్ధమైన భారత్ కోసం మద్దతుగా నిలుస్తోందని తెలిపారు.

# సంయమనం పాటిస్తున్నా..సహనాన్ని పరీక్షించొద్దు



ఇప్పటికే బీఆర్ఎస్ నేతల అక్రమ కట్టడాలను, ఆక్రమణలు తొలగించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇక ముందు కూడా అలాంటి అక్రమార్కుల భరతం పడతానని ఆయన హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన దళిత బందులో అనేక అవకతవకలు జరిగాయని, బీఆర్ఎస్ కార్యకర్తలనే లబ్ధిదారులుగా ఎంపిక చేశారని, లంచాలు తీసుకొని యూనిట్లు ఇప్పించిన విషయం మానకొండూర్ నియోజకవర్గ ప్రజలందరికీ తెసుసని ఆయన పేర్కొన్నారు. దళిత బంధులో మూడు లక్షలు తీసుకొంటున్నారని సాక్షాత్తు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పిన విషయాన్ని ఆయన ఉటంకించారు. పదేళ్లు అధికారం కట్టబెడితే ఆటపాటలతోనే కాలంగడిపిన రసమయి పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టించిన పాపాన పోలేదని, పేదల సంక్షేమాన్ని గాలికొదిలారని ఎద్దేవా చేశారు. పదేళ్ల కాలంలో ఎన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఎన్ని కట్టించావో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్లు ఇవ్వలేని రసమయి కూడా పేదోళ్లకు ఇళ్లు ఇస్తుంటే జీర్ణించుకోలేక ఆ పథకం అమలుపై విషం చిమ్ముతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నదని చెప్పారు. బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షునికి కూడా ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామంటే ఇంతకు మించిన పారదర్శత ఇంకేముందని ఆయన ప్రశ్నించారు. వాస్తవాలు తెలుసుకోకుండా వాగడం సరికాదన్నారు. పేదల సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం కావాలని, ఆ లక్ష్య సాధన కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తున్నదని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని ఆయన చెప్పారు. అమలులో ఉన్న ఉచిత బస్సు ప్రయాణాలపై బీఆర్ఎస్ వాళ్లు చెత్తవాగుడు వాగుతూ మహిళలను అవమానపరుస్తున్నారని ఆయన విమర్శించారు. ఉచిత విద్యుత్ ప్రయోజనాలను పేదలు పొందుతున్నారన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని దొడ్డు బియ్యానికి బదులుగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రైతులకు 2 లక్షల వరకు రుణాలను మాఫీ చేశామని, తాజా రైతు భరోసా కింద 9000 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు.గత ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల మంజూరు కావడం గగనమయ్యేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక చెక్కుల మంజూరువేగవంతమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 16 విడతల్లో చెక్కులు మంజూరయ్యాయని ఆయన చెప్పారు. ఇప్పటి వరకు మానకొండూర్ నియోజకవర్గంలో 5557 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 14.98 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందిందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి వివరించారు.

ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్ఎల్ గౌడ్, పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి, సిరిగిరి రంగారావు,కుంట రాజేందర్ రెడ్డి, చింతల లక్ష్మారెడ్డి, కొత్త తిరుపతిరెడ్డి, రాములు యాదవ్, మాచర్ల అంజయ్య, గొట్టెముక్కుల సంపత్ రెడ్డి, బుధారపు శ్రీనివాస్, కొత్త రాజిరెడ్డితోపాటు వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు,సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మరమ్మతు పనులు ప్రారంభించిన ఇరాన్

- వారంలోపే అణుకేంద్రానికి మరమ్మతులు!
- అమెరికా దాడులతో దెబ్బతిన్న ఫోర్డో అణు కేంద్రం
- నిర్మాణ పనులను స్పష్టం చేస్తున్న తాజా శాటిలైట్ చిత్రాలు
- శిథిలాల తొలగింపునకు బుల్డోజర్లు, ఎక్స్‌కవేటర్ల వినియోగం



**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా జరిపిన భారీ వైమానిక దాడుల నుంచి ఇరాన్ వేగంగా కోలుకునే ప్రయత్నాలు ప్రారంభించింది. తమ అణు కేంద్రంపై బాంబుల వర్షం కురిపించిన వారం తిరగకముందే, దెబ్బతిన్న ఫోర్డో ఇంధన శుద్ధి కర్మాగారం (ఎఫ్ఎఫ్ఈపీ) వద్ద మరమ్మతు పనులను ముమ్మరం చేసింది. శుక్రవారం (జూన్ 27) మాక్సర్ టెక్నాలజీస్ విడుదల చేసిన తాజా శాటిలైట్ చిత్రాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఫోర్డో అణు కేంద్రం ఉన్న పర్వత ప్రాంతంలో నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నట్టు శాటిలైట్ చిత్రాలు చూపిస్తున్నాయి. అమెరికా దాడులతో ఏర్పడిన శిథిలాలను తొలగించేందుకు ఎక్స్‌కవేటర్లు, బుల్డోజర్లను పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. ముఖ్యంగా, అమెరికాకు చెందిన శక్తివంతమైన జీబీయూ–57 'బంకర్ బస్టర్' బాంబులు లక్ష్యంగా చేసుకున్న సొరంగ మార్గాల వద్ద ఈ పనులు కేంద్రీకృతమయ్యాయి. భూగర్భంలో ఉన్న అణు కేంద్రానికి ఈ మార్గాలు అత్యంత కీలకమైనవి. ఇంతేకాకుండా, పర్వతంపైకి కొత్తగా యాక్సెస్ రోడ్లను నిర్మిస్తున్న ఆనవాళ్లు కూడా కనిపిస్తున్నాయి. దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను పునరుద్ధరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఈ చిత్రాల ద్వారా స్పష్టమవుతోంది. దాడుల వల్ల లోపల జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి, పునరుద్ధరణ పనులు చేపట్టడానికి ఇరాన్ అధికారులు ప్రయత్నిస్తున్నట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఈ మరమ్మతు పనులపై ఇరాన్ ప్రభుత్వం ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు.

**– ముందే ఊహించిన నివేదిక**

ఇరాన్ చర్యలను రాయల్ యునైటెడ్ సర్వీసెస్ ఇనిస్టిట్యూట్ (ఆర్‌యూఎస్ఐ) అనే సంస్థ తన మార్చి నివేదికలోనే అంచనా వేసింది. ఇరాన్‌పై దాడులు జరిగితే, ఆ దేశం పునర్నిర్మాణ ప్రయత్నాలను వెంటనే ప్రారంభిస్తుందని ఆ నివేదికలో పేర్కొంది. దాడుల తర్వాత సరఫరాలను, రాకపోకలను పునరుద్ధరించడానికి ఇరాన్ తక్షణమే రంగంలోకి దిగుతుందని తెలిపింది. ప్రస్తుతం ఫోర్డోలో జరుగుతున్న పరిణామాలు ఆ నివేదిక అంచనాలకు అద్దం పడుతున్నాయి. గత వారాంతంలో పశ్చిమాసియాలో ఘర్షణలను తీవ్రతరం చేస్తూ అమెరికా.. ఇరాన్‌లోని ఫోర్డో, నతాంజ్, ఇస్ఫహాన్ అనే మూడు కీలక అణు కేంద్రాలపై వైమానిక దాడులు జరిపిన విషయం తెలిసిందే. ఈ దాడుల తర్వాత ఇరాన్ ఇంత వేగంగా స్పందించడం అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది.

# రూ.2500 కోసం వెయిటింగ్..!

మొదటి పేజీ తరువాయి

అమలు చేస్తామని ఆర్భాటంగా చెప్పారు. దీంతో జిల్లాలో మహిళలు మహాలక్ష్మి పథకం ద్వారా అందించే సహాయం కోసం ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ప్రజా పాలనలో మహాలక్ష్మి సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నామని మహిళలు ఆరోపిస్తున్నారు. పథకం అమలు ఆలస్యం కావడానికి ఆర్థిక బారమని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. మహాలక్ష్మి పథకంలో ఇప్పటికే రెండు కీలకమైన పథకాలను పొందుతున్నారు. టి ఎస్ ఆర్ టి సి మహిళల ఉచిత ప్రయాణం, గ్యాస్ సబ్సిడీ 500 రూపాయలు పొందుతున్నారు. ఇక మహిళలకు నెలవారీగా 2500 పథకం మాత్రమే మిగిలి ఉంది. అయితే ఇటీవల స్థానిక సంస్థలు ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంతో ఈ పథకం కూడా అతి త్వరలోనే మహిళలకు నెలనెలా 2500 సంవత్సరానికి గాను 30 వేల రూపాయలు నేరుగా బ్యాంక్ అకౌంట్లో జమ చేయడానికి స్కీం ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాల నుండి వినికిడి వినిపిస్తుంది. ఈ పథకం ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ప్రకటించారు.పథకం అతి త్వరలో ప్రారంభించాలని మహిళలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ పథకం ద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపరిచి ఆర్థికంగా తోడ్పాటు అందిస్తుందని వారు పేర్కొంటున్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా రూ.2500 నెల నెల అందిస్తే తమ కుటుంబానికి ఆసరా ఉంటుందని మహిళలు తెలుపుతున్నారు.

# ప్రధాని మోదీకి ధర్మ చక్రవర్తి బిరుదు ప్రదానం

మొదటి పేజీ తరువాయి

భావిస్తున్నాను. కానీ సాధువుల నుండి మనం ఏది స్వీకరించినా దానిని ప్రసాదంగా స్వీకరిస్తాం అనేది మన సంస్కృతి. కాబట్టి, నేను ఈ ప్రసాదాన్ని వినయంగా స్వీకరించి మా భారతికి అంకితం చేస్తున్నాను." అని అన్నారు. ఆచార్య శ్రీ 108 విద్యానంద్ జీ మహారాజ్ కు ఏడాది పొడవునా నిర్వహించే జాతీయ నివాళికి ఈ శతాబ్ది ఉత్సవాలు నాంది పలుకుతాయి. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, ఢిల్లీలోని భగవాన్ మహావీర్ అహింసా భారతి ట్రస్ట్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు గౌరవనీయ జైన నాయకుడి ఆధ్యాత్మిక, పండిత వారసత్వాన్ని స్మరించుకోవడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఆచార్య విద్యానంద్ జీ జూన్ 28, 1987న 'ఆచార్య' బిరుదును పొందారని ప్రధాని మోదీ గుర్తు చేశారు. "ఇది కేవలం గౌరవం కాదు, జైన సంస్కృతిని సంయమనం, కరుణతో అనుసంధానించే పవిత్ర ధార" అని మోదీ అన్నారు. ఈ వేడుకలను క్రమశిక్షణ, సన్యాసి జీవితాన్ని గుర్తుచేసే వేడుకలుగా అభివర్ణిస్తూ, ప్రధానమంత్రి ఆచార్యకు తన నివాళు లర్పించారు. శత జయంతి నివాళిలో భాగంగా ప్రధానమంత్రి మోదీ, కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఆచార్య శ్రీ 108 విద్యానంద్ జీ మహారాజ్ గౌరవార్థం స్మారక పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేశారు. అంతకుముందు రోజు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి షెకావత్ "ఆచార్య శ్రీ 108 విద్యానంద్ జీ మహారాజ్ జీవితం, వారసత్వం" అనే ప్రదర్శనను సందర్శించారు.

# పాకిస్థాన్ లో ఆత్మాహుతి దాడి

- ఘటనలో 16 మంది పాక్ సైనికులు దుర్మరణం
- 24 మందికి పైగా గాయాలు, వారిలో పౌరులు కూడా
- పేలుడు ధాటికి రెండు ఇళ్ల పైకప్పులు కూలి ఆరుగురు చిన్నారులకు గాయాలు
- తామే దాడికి పాల్పడినట్టు ప్రకటించిన పాకిస్థానీ తాలిబన్లు



**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో మరోసారి నెత్తురు చిందింది. ఉత్తర వజీరిస్థాన్ జిల్లాలో సైనిక కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని పాకిస్థానీ తాలిబన్లు జరిపిన ఆత్మాహుతి దాడిలో 16 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో పౌరులతో సహా మరో 24 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. శనివారం జరిగిన ఈ సంఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. స్థానిక ప్రభుత్వ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఒక ఆత్మాహుతి దళ సభ్యుడు పేలుడు పదార్థాలతో నింపిన వాహనాన్ని వేగంగా నడుపుకుంటూ వచ్చి సైనిక కాన్వాయ్‌ను ఢీకొట్టాడు. దీంతో భారీ పేలుడు సంభవించి సైనికులు ప్రయాణిస్తున్న వాహనాలు ధ్వంసమయ్యాయి. పేలుడు తీవ్రతకు సమీపంలోని రెండు ఇళ్ల పైకప్పులు కూలిపోయాయని, ఫలితంగా ఆరుగురు చిన్నారులు గాయపడ్డారని జిల్లాలోని ఒక పోలీస్ అధికారి వెల్లడించారు. మొదట మృతుల సంఖ్య 13గా ఉన్నప్పటికీ, ఆ తర్వాత 16కి పెరిగినట్టు అధికారులు ధ్రువీకరించారు. ఈ ఆత్మాహుతి దాడికి తామే బాధ్యత వహిస్తున్నట్టు పాకిస్థానీ తాలిబన్‌కు చెందిన హాఫీజ్ గుల్ బహదూర్ గ్రూప్ ప్రకటించుకుంది. ఒక ఆత్మాహుతి దళ సభ్యుడు పేలుడు పదార్థాలతో నింపిన వాహనాన్ని వేగంగా నడుపుకుంటూ వచ్చి సైనిక కాన్వాయ్‌ను ఢీకొట్టాడు. దీంతో భారీ పేలుడు సంభవించి సైనికులు ప్రయాణిస్తున్న వాహనాలు ధ్వంసమయ్యాయి. 2021లో ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్లు తిరిగి అధికారం చేపట్టినప్పటి నుంచి పాక్ సరిహద్దు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు గణనీయంగా పెరిగాయి. తమ భూభాగం నుంచి ఉగ్రవాదులు దాడులకు పాల్పడుతున్నారని పాకిస్థాన్ పదేపదే ఆఫ్ఘనిస్థాన్‌పై ఆరోపణలు చేస్తోంది. అయితే, ఈ ఆరోపణలను కాబూల్‌లోని తాలిబన్ ప్రభుత్వం ఖండిస్తూ వస్తోంది. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్ ప్రావిన్సులలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ గ్రూపులు జరిపిన దాడుల్లో సుమారు 290 మంది మరణించారని, వీరిలో అత్యధికులు భద్రతా సిబ్బందేనని ఏఎఫ్‌పీ వార్తా సంస్థ గణాంకాలు చెబుతున్నాయి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073